# బలహీనత

**బి.పి. కరుణాకర్**



**దాదాపు నాలుగు గంటలకు పైగా మేము కలిసి ప్రయాణం చేస్తున్నా పుస్తక పఠనంలో లీనమయిపోయిన నేను ఆమెను శ్రద్ధగా గమనించలేదు. అరగంటలో బండి తెనాలి చేరుకుంటుందనగా ఆమె నన్ను పలకరించటానికి ప్రయత్నం చేస్తున్నట్లు గ్రహించాను. కంపార్ట్‌మెంట్‌లో జనం అట్టే లేరు.**

పుస్తకం మూసి సంచిలో పెట్టి ఆమె వంక చూశాను. ఆమెకు ఇరవై ఎనిమిది సంవత్సరాల వయసు ఉంటుందేమో చామనఛాయలో మనిషి ఆకర్షణీయంగా ఉంది. పక్కనే చిన్న పాప ఉంది. పాపకు నాలుగు సంవత్సరాల వయస్సు ఉండొచ్చు.

"నీ పేరేమిటమ్మా?" పాపను అడిగాను. పాప తల్లి చాటుకు జరిగింది.

పాప తరపున తల్లి సమాధానం చెప్పింది. "పావని" అని. ఆమె గొంతు బొంగురుగా ఉంది.

పాపకు రవంత బిడియం తగ్గినట్లుంది. తల్లి ముందుకు వచ్చింది. "బడికి వెళ్తున్నావా?" అడిగాను. పాప నా ముఖంలోకి చూసిందే కాని జవాబు చెప్పలేదు.

"పావనికి మాటలు రావు" నవ్వి అన్నాను.

"వచ్చు" అంది పావని.

"ఏం చదువుతున్నావు?" అడిగాను.

"బడిలో చేర్పించలేదండీ. వచ్చే సంవత్సరం చేర్పిద్దామనుకుంటున్నాం" అంది ఆమె. కొద్ది సేపు మౌనంగా ఉండి "మీరు ఎక్కడికి వెళ్తున్నారు?" అడిగింది.

చెప్పాను.

"నేను వేమూరు దాటి వెళ్ళాలి" అంది.

"ఏ ఊరు?"

చెప్పలేదు.

నేను చేతి గడియారం వంక చూసి, "ఈ బండి రెండు గంటలు ఆలస్యంగా నడుస్తోంది. ఈ సరికి రేపల్లె బండి వెళ్ళిపోయి ఉంటుందేమో.." అనుమానం వ్యక్తం చేశాను.

"టైం ఎంతయింది?" అడిగింది.

"తొమ్మిదీ పది"

"మీరేం చేస్తుంటారు?"

చెప్పాను.

"ఎక్కడ?"

చెప్పాను.

"ఈ ఊరు మీ స్వస్థలమా?"

"అంతే అనుకోవచ్చు. నా భార్యా పిల్లలూ చిన రాపూరులో ఉంటున్నారు. నేనే అప్ అండ్ డౌన్ చేస్తుంటాను. వరసగా మూడు రోజులు సెలవులు దొరికే సరికి ఇంటికి వెళ్తున్నాను."

"నేనూ పండక్కి మా పుట్టింటికి వెళ్తున్నాను. ఆయనకు సెలవు దొరకలేదు. పండగ నాటికి వస్తానన్నారు కానీ వస్తారో, రారో తెలియదు..."

"మీ వారు ఎక్కడ పని చేస్తున్నారు?"

చెప్పింది.

"ప్రైవేటు కంపెనీలోనా?"

తలూపింది.

"మా తమ్ముడు రఘు అని తెనాలిలో కారు అద్దెకు తిప్పుతుంటాడు. వాడిని తెనాలి వచ్చి నన్ను పావనిని తీసుకెళ్ళమని నిన్న మా ఆయన ఫోను చేసి చెప్పారు. నన్ను బండి ఎక్కించాక వాడికి ఫోను చేసి చెబుతానన్నారు..." అగింది.

"మీరు ఒంటరిగా ప్రయాణం చేయటం కొత్తా?"

"కాదు గాని..."

"మీరు భయపడవలసిన అవసరం లేదు. మా వాడు స్టేషన్‌లో మీకోసం వెయిట్ చేస్తూ ఉంటాడు."

"మా రఘు వట్టి మతిమరపు వెధవ."

"మీ వాడు రాకపోతే బస్సులో వెళ్ళండి."

"ఈ సమయంలో మా ఊరికి బస్సులుండవు."

మాటల్లో తెనాలి వచ్చింది. నేను నా సంచి తీసుకుని బండి దిగి పావనిని అందుకున్నాను. తను పెట్టెలు సామాన్లు పట్టుకుని బండి దిగుతోంటే సహాయం చేశాను. సామాన్లు ప్లాట్‌ఫాం మధ్యలో బెంచి మీద పక్క పక్కనే పెట్టి లెక్క బెట్టుకుంది. నాకు వెళ్ళిపోదామని ఉంది. ఆమె తన తమ్ముడికోసం చూసింది. ఆమె ఊహించి

నట్లు అతను వచ్చినట్లు లేదు. మనిషిలో కలవరం మొదలయింది. పావనిని ఎత్తుకుంది.

"నేను వెళ్తాను" అని కదిలాను.

"మాట" అంది.

ఆగాను.

"మీరు దయచేసి నాకో సహాయం చేయగలరా?" అడిగింది.

నా ఇబ్బంది వ్యక్తం చేయకుండా "చెప్పండి" అన్నాను.

"మా తమ్ముడు వచ్చాడో లేదో బయటకు వెళ్ళి చూసి వస్తాను. అంత వరకు ఈ సామాన్లు చూడగలరా?"

తలూపి, "త్వరగా వచ్చేయండి" అన్నాను.

ఆమె బయల్దేరబోతూ ఆగి, "మీ పేరు?" అడిగింది.

చెప్పాను.

"నా పేరు సుమిత్ర" అని మెయిన్ గేటు వైపు నడిచింది.

టీస్టాలు దగ్గరకు నడిచి టీ తాగి సిగరెట్ వెలిగించాను. అరగంట తర్వాత గాని సుమిత్ర తిరిగి రాలేదు. వస్తూనే, "మావాడు బయట ఎక్కడా కనబడలేదు. వాడి స్నేహితులు కూడా దొరక లేదు. ఎక్కడ చచ్చాడో ఏమో" విసుగ్గా అని చీర కొంగుతో ముఖం తుడుచుకుని, పావనిని కిందకు దింపింది. ఒక్క క్షణం నా ముఖంలోకి నింపాదిగా చూసి "ఇప్పుడు నన్నేం చేయ మంటారు?" నెమ్మదిగా అడిగింది.

"ఈ ఊళ్ళో మీ చుట్టాలు ఎవరూ లేరా?"

"లేరు"

"కనీసం... తెలిసిన వాళ్ళు?"

"ఊహు".

"మీకు ఎటువంటి అభ్యంతరం లేకపోతే మా ఇంటికి రండి."

"నేను మీకూడా వస్తే మీ ఇంట్లో వాళ్ళేమీ అనుకోరా?"

"ఏమీ అనుకోరు. నా భార్య చాలా మంచిది."

"నేను మీకు ఇబ్బంది కలిగించటం లేదు కదా?"

"లేదు. ఈ రాత్రికి మా ఇంట్లో ఉండి రేపు ఉదయాన్నే బస్సు పట్టుకుని మీ ఊరు వెళ్ళిపోదురుగాని..." అంటుంటే "సరే పదండి..." అని అంది కాని స్టేషన్ బయటకు వచ్చాక సుమిత్ర మనసు మార్చుకుని, "మీరేమనుకోకండి. మీ ఇంటికి వద్దు. ఈ రాత్రికి ఏదయిన హోటలుకు వెళ్దాం ఇద్దరం. హోటలులో ఒక్కదాన్ని ఉండలేక కాదు. రిస్కు తీసుకోవటం నాకు ఇష్టం లేదు. దయచేసి నా మాట కాదనకండి" అంది.

నాకు మొహమాటం ఎక్కువ. ఆడవాళ్ళ విషయంలో మరీను. కాదనలేకపోయాను.

"ఈ రాత్రికి మీరింటికి రాకపోతే మీ వాళ్ళు గాభరాపడరు కదా?" అడిగింది.

"లేదు"

సుమిత్ర నా అనుమతి కోసం ఎదురు చూడకుండా రిక్షా పిలిచి మాట్లాడి తను ఎక్కి కూర్చుని జరిగి నాకు చోటిచ్చింది. కూర్చున్నాను. సామాన్లు పెట్టాక రిక్షా ముందుకు కదిలింది. జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాను.

"ప్లీజ్. సిగరెట్ పడేయండి. సిగరెట్ పొగ నాకు పడదు. నిజం చెప్పాలంటే సిగరెట్ తాగే వాళ్లంటే నాకు అసహ్యం" అంది నిర్మొహమాటంగా.

నన్నంత మాట ఎప్పుడూ ఎవరూ అనలేదు. రిక్షా ఆపి దిగిపోదామనిపించింది. కోపాన్ని నిగ్రహించుకుని పీల్చిన పొగ పక్కకు ఊది సిగరెట్ మురికి కాలవలో పడేలా విసిరాను. పది నిమిషాల తర్వాత రిక్షా ఉడ్‌లాండ్స్ హోటలు ముందాగింది. డబుల్ బెడ్ రూం నా పేర తీసుకున్నాను. అడ్వాన్స్ ఇచ్చి గదిలోకి వచ్చాక నే కట్టిన అడ్వాన్స్ డబ్బు సుమిత్ర నాకిచ్చేసింది. స్నానం చేసి గదికి వచ్చిన క్యారియర్ భోజనం చేసిన తర్వాత మంచం మీద సుమిత్ర, పావని పడుకున్నారు. నా సంచిలోంచి దుప్పటి తీసి నేలమీద పరుచుకున్నాను. లైటుంటే నాకు నిద్ర పట్టదు. లైటార్పేయబోతోంటే, "లైటు ఉండనీయండి. తలుపు కూడా తీసి ఉంచండి." అంది.

లైటు ఆర్పేయలేదు. తలుపు తీసి సంచిని తలగడగా పెట్టుకుని దుప్పటి మీదే పడుకున్నాను. ఆమె భయం నాకు అర్థం అయింది. నిజానికి ఆమెకు సహాయం చేసే ఉద్దేశం తప్ప వేరే విధమైన తలంపు నాకు లేదు. గంట ఇబ్బందిపడ్డాక గాని నిద్ర పట్టలేదు.

తెలతెలవారుతుండగా స్నానాలగదిలో నీళ్ళ చప్పుడుకు నాకు మెలకువ వచ్చింది. గది తలుపు మూసి గడియపెట్టి ఉంది. మంచం మీద సుమిత్ర లేదు. స్నానం చేస్తోందనుకుంటాను. పావని నిద్రపోతోంది. గదిలో లైటు లేదు. గదిలో గాలి చల్లగా ఉంది. తువ్వాలు కప్పుకుని కళ్ళుమూసుకున్నాను. నిద్ర పట్టింది.

అరగంట తర్వాత నా చేతికి చల్లటి స్పర్శ తగిలేసరికి నిద్ర ఎగిరిపోయింది. తువ్వాలు తీసి ముఖం తుడుచుకున్నాను. సుమిత్ర నా పక్కనే నన్ను ఆనుకుని కూర్చుని ఉంది. లేచి కూర్చుందామనుకున్నాను. ఆమె చేతులు నా భుజాల మీద వేసింది. గంధపు సబ్బు వాసన నా ముఖానికి తగులుతోంది. రాత్రంతా నిద్ర పోలేదేమో ఆమె కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

"మీకు శ్రమ కలిగించాను" అంది.

నిజమే అయినా "పరవాలేదు" అన్నాను.

"ఇంకో గంటలో మీదారిన మీరు వెళ్ళిపోతారు. నా దారిన నేను వెళ్ళిపోతాను. మీరు ఎటువంటి వారో తెలియక భయపడుతూ రాత్రి నిద్ర లేకుండా గడిపాను. మిమ్మల్ని అనుమానించినందుకు సిగ్గుపడుతున్నాను.... మీరు నాకు ఎటువంటి శిక్ష అయినా వేయవచ్చు." తన శరీరం పూర్తిగా నాకు తగులుతోంది. అమె కోరుకుంటున్న శిక్ష ఆమె కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తోంటే సంచిలోంచి సిగరెట్ తీసి వెలిగించాను.

సుమిత్ర అభ్యంతరం చెప్పలేదు. ❋

చదవండి! చదివించండి!!

ఆటవిడుపు

పిల్లల సచిత్ర మాస పత్రిక

సెప్టెంబర్ 2004 సంచిక

విజ్ఞాన వినోదాల విపంచిక

